
# అభివృద్ధి కోసం 'పల్లా'ను గెలిపించండి

**బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమా**



ఐనాపూర్‌లో చికెన్ సెంటర్ నిర్వాహకుడిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లా నీలిమా

కొమురవెల్లి, నవంబర్ 22 : నియోజకవర్గ అభివృద్ధి కోసం విద్యావంతుడైన 'పల్లా'ను గెలిపించాలని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమా అన్నారు. బుధవారం కొమురవెల్లి మండల కేంద్రంతోపాటు ఐనాపూర్, రసూలాబాద్ గ్రామాల్లో ఎంపీపీ తలారి కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపిస్తే 18 ఏండ్లు నిండిన మహిళలకు ప్రభుత్వం సౌభాగ్యలక్ష్మి పేరిట ప్రతినెలా రూ.3 వేలు పింఛన్, రూ.400కే వంట గ్యాస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, సర్పంచులు సార్ల లతాకిష్టయ్య, పచ్చిమడ్ల స్వామిగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ మెరుగు కృష్ణాగౌడ్, కొమురవెల్లి ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి మద్దతు తెలుపుతున్న నర్సాయపల్లి దళితులు

## 'పల్లా'కు నర్సాయపల్లి దళితుల మద్దతు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 22 : మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన పలువురు దళితులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జనగామలో బీఆర్ఎస్ జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువనున్నట్లు తెలిపారు. అభివృద్ధి చేసే పార్టీకి అందరూ అండగా నిలవాలన్నారు. పల్లాకు మద్దతు ప్రకటించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ముస్త్యాల శ్రీనివాస్, ఎలీషా, సిద్ధులు, మహేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## 'పల్లా'ను గెలిపించాలి

చేర్యాల, నవంబర్ 22 : చేర్యాల మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని 12 వార్డుల్లో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను ఎన్నికలు ముగిసిన నెల రోజుల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, మరో రూ.10 కోట్లు సైతం మున్సిపల్ అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు.



చేర్యాల : 3వ వార్డులో దివ్యాంగుడికి అన్నం తినిపిస్తున్న బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ చంటి

## కొమురవెల్లి స్వాగత తోరణం రహదారి మూసివేత

చేర్యాల, నవంబర్ 22 : కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి క్షేత్రానికి వచ్చే ప్రధాన దారుల్లో ఒక్కటైన రాజీవ్ రహదారిపై అనుకుని ఉన్న కొమురవెల్లి స్వాగత తోరణం రహదారిని బుధవారం నుంచి మూసివేస్తున్నట్లు సంబంధితశాఖ అధికారులు ప్రకటించారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో భాగంగా ఇప్పటికే రైల్వేట్రాక్ నిర్మాణ పనులను అధికారులు పూర్తి చేశారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి వచ్చే భక్తులు కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి చేరుకోవాలంటే ఇదే స్వాగత తోరణం రోడ్డు నుంచి రావాల్సి ఉంటుంది. నూతనంగా రైల్వేట్రాక్ నిర్మించడంతో ఈమార్గం నుంచి వచ్చే భక్తులు రైలు వచ్చిన సమయంలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. దీనిని పరిశీలించిన సంబంధిత రైల్వే అధికారులు కొమురవెల్లి స్వాగత తోరణం నుంచి వచ్చే రహదారి నుంచి రైల్వేట్రాక్ వద్ద అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 6, 2024 వరకు స్వాగత తోరణం రోడ్డును మూసివేసేందుకు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులకు అనుమతి ఇచ్చారు. ఇక నుంచి కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాజీవ్ రాహదారిలోని తిమ్మారెడ్డిపల్లి స్వాగత తోరణం నుంచి ఐనాపూర్, రసూలాబాద్ మీదుగా కొమురవెల్లికి చేరుకోవాల్సి ఉంటుంది.

## అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ఆదరించాలి

**పల్లా అనురాగ్‌రెడ్డి**

చేర్యాల, నవంబర్ 22 : గ్రామాలను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని, జనగామ నియోజకవర్గంపై మరోసారి గులాబీ జెండా ఎగరవేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కుమారుడు పల్లా కుమారుడు అనురాగ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చుంచనకోట గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ప్రజలను కలిసి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించడంతోపాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తే చేర్యాల ప్రాంతానికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం అనురాగ్‌రెడ్డి మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇప్పటికే చేర్యాల ప్రజల చిరకాల వాంఛ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయించారని, ఎన్నికల కోడ్ కారణంగా జీవో విడుదల కాలేదన్నారు. ప్రచార కార్యక్రమానికి ముందే పట్టణంలోని ఓ క్యాంటిన్‌లో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, సర్పంచ్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆది రాజు, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ సూటిపల్లి బుచ్చిరెడ్డి, యూత్ అధ్యక్షుడు మహేశ్, పండుగ రాము, పొట్టి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల మండలం చుంచనకోటలో ప్రచారం చేస్తున్న పల్లా అనురాగ్‌రెడ్డి

## ముమ్మరంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



మర్మాములలో ఉపాధి కూలీలను ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 22 : మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. బుధవారం మద్దూరు మండలం మర్మాములలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, సర్పంచ్ సుందరగిరి స్రవతీ పరశురాములుగౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ధూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ నలుగొప్పుల రేణుకారాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంకణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 22 : ధూళిమిట్ట మండలం కొండాపూర్ మాజీ సర్పంచ్ కోడం పద్మానీలయ్య దంపతులు బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోదరుడు పల్లా కరుణాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్ దంపతులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కొండాపూర్ మాజీ సర్పంచ్ పద్మానీలయ్య దంపతులు

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

జగదేవ్‌పూర్, నవంబర్ 22 : కేసీఆర్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉందని చాట్లపల్లి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎగుర్ల కనకయ్య అన్నారు. బుధవారం మండలంలోని చాట్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇం టింటి ప్రచారం నిర్వహించారు.

**వర్గల్‌లో..**

వర్గల్, నవంబర్ 22 : కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు ఇచ్చి యావత్ మహిళా లోకానికే కేసీఆర్ ఆదర్శంగా నిలిచారని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు లింగ నాగరాజు తెలిపారు. బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వరంలో సీతారాంపల్లి, అనంతగిరిపల్లి, వేలూర్, సీతారాంపల్లి తండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోవైపు మండలంలోని సీతారాంపల్లికి చెందిన బీజేపీ కార్యకర్తలు మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.



జగదేవ్‌పూర్ : చాట్లపల్లిలో టీ చేస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు



వర్గల్ : సీతారాంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకులు

## 25న మద్దూరులో మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 22 : ఈనెల 25న(శనివారం) మద్దూరు మండల కేంద్రంలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా రోడ్‌షో నిర్వహించనున్నారు. రోడ్‌షో కోసం మంత్రి హరీశ్‌రావు హెలికాప్టర్‌లో మద్దూరుకు రానున్న దృష్ట్యా మద్దూరులో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై షేక్‌యూనూస్ అహ్మద్‌తోపాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం ధూళిమిట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మద్దూరులో జరిగే మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో గురించి ప్రత్యేకంగా చర్చించారు. మరోవైపు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శాలివాహన సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. ఈ మేరకు మద్దతు లేఖను బీఆర్ఎస్ నాయకులకు అందజేశారు. సమావేశంలో ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి, బీఆర్ఎస్ నాయకుడు పాల్గొన్నారు.



మద్దూరులో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



ధూళిమిట్టలో బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ లేఖను అందజేస్తున్న శాలివాహన సంఘం నాయకులు

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! శ్రీ సూరం పురుషోత్తం తండ్రి లక్ష్మి నారాయణ, నివాసం సిద్దిపేట గారు నా యొక్క క్లయింట్ బ్యాంక్/ఫైనాన్స్‌ను రుణ సదుపాయం నిమిత్తం సంప్రదించి తనకు విక్రయ దస్తావేజు నెం. 12258/2019 SRO సిద్దిపేట అర్బన్ ద్వారా సంక్రమించిన ఆస్తి గ్రామం : పొన్నాల, మండలం : సిద్దిపేట అర్బన్, జిల్లా: సిద్దిపేటలో గల సర్వే నెం. 55, ప్లాట్ నెం. 17, వైశాల్యం 156 చ. గలు దీని యొక్క హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 18, పడమర:- ప్లాట్ నెం. 16, ఉత్తరం : రోడ్డు 21 ఫీట్లు, దక్షిణం: జగదీశ్వర్ నగర్ కాలనీ ప్లాట్లు, గల దానిని తనఖాగా పెట్టి రుణ సదుపాయం పొందగోరుచున్నాడు మరియు ఇట్టి ఆస్తి యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నెం. 2228/2003 SRO సిద్దిపేట అర్బన్ గలది పోయినది కావున ఇట్టి ఆస్తి విషయంలో గాని దస్తావేజు విషయంలో గాని, ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు, క్లయిములు ఉన్నచో తగు ఆధారాలతో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు నా కార్యాలయములో వ్రాత పూర్వకముగా సంప్రదించగలరు లేనిచో తదుపరి ఎలాంటి ఆక్షేపణలు చెల్లనేరవు మరియు తదుపరి నా క్లయింట్ బ్యాంక్/ఫైనాన్స్ పైన పేర్కొన్న ఆస్తిని తనఖా పెట్టుకొని తదుపరి చర్యలు తీసుకొనును.

సం/- **పిన్న రాములు**, అడ్వకేట్ & నోటరి
ఇ.నం. 9-4-3, కోర్ట్ దగ్గర, సిద్దిపేట-502103.
(T.S.) సెల్: 9849321422